సాక్షి
చిత్తూరు

శనివారం । 4 । మార్చి । 2023



హారతి సమర్పిస్తున్న వేదపండితులు (ఇన్‌సెట్) అనుగ్రహభాషణం చేస్తున్న శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతిస్వామి

గణనాథునికి
మహా హారతి

కాణిపాకం(యాదమరి):కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయ పుష్కరిణిలో శుక్రవారం రాత్రి మహా హారతి సమర్పించారు. లక్ష మోదక లక్ష్మీ గణపతి హవనము పూజల్లో భాగంగా వినాయక స్వామి, గంగాదేవికి విశాఖ శారద పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి తొలుత హారతులు ఇచ్చారు. భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. అనంతరం ఆలయ అర్చకులు పుష్కరిణికి, అందులో వెలసిన వినాయకునికి హారతి ఇచ్చి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, ఈఈ వెంకటనారాయణ, సినీ గాయకుడు గజల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఎన్నికల కసరత్తుపై అవగాహన



ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లతో మాట్లాడుతున్న డీఆర్‌ఓ

చిత్తూరు కలెక్టరేట్ : ఎమ్మెల్సీ ఎన్నికల కసరత్తుపై ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లుకు డీఆర్‌ఓ రాజశేఖర్ అవగాహన కల్పించారు. శుక్రవారం కలెక్టరేట్‌కు వచ్చిన ట్రైనీలు కిరణ్మయి, శ్రీలేఖ, మనోజ్‌రెడ్డికి ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్, కౌంటింగ్‌కు సంబంధించిన పలు అంశాలను వివరించారు.

20న ఆన్‌లైన్‌లో వాహనాల వేలం

చిత్తూరు అర్బన్: జిల్లా పోలీసుశాఖలో కాలం చెల్లిన పలు వాహనాలను ఈ నెల 20వ తేదీన ఆన్‌లైన్ ద్వారా వేలం వేయనున్నట్లు ఎస్పీ రిషాంత్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మొత్తం 56 వాహనాలను 16 విభాగాలు విభజించి వేలానికి ఉంచినట్లు పేర్కొన్నారు. ఆసక్తిగలవారు **www. konugolu.ap.gov.in** వెబ్‌సైట్‌లో ధర కోట్ చేయవచ్చన్నారు. అత్యధిక ధర వేసినవాళ్లకు వాహనాలు దక్కుతాయని వెల్లడించారు. వివరాలకు ఎంటీఓ: 9491074516, ఆర్ఐ: 9441528862 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

స్కానింగ్ సెంటర్లలో తనిఖీ

చిత్తూరు రూరల్: నగరంలోని పలు స్కానింగ్ సెంటర్లను శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తనిఖీ చేశఋూరు. డీఎంఅండ్‌హెచ్‌ఓ జి.ప్రకాశం, డీఐఓ రవిరాజు, అధికారి రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో రికార్డులు పరిశీలించారు. నిబంధనల ప్రకారమే స్కానింగ్ సెంటర్లు నిర్వహించాలని, ఆదేశాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. లైసెన్సును విధిగా రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు.

అవసరాలకు తగ్గట్టు ట్రాన్స్‌ఫార్మర్లు



మాట్లాడుతున్న రూరల్ ఈఈ హరి

చిత్తూరు కార్పొరేషన్: వేసవిని దృష్టిలో పెట్టుకుని లోడ్ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో అవసరాలకు తగ్గట్టు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని రూరల్ ఈఈ హరి ఆదేశించారు. విద్యుత్ బిల్లుల బకాయిలను పదిరోజుల్లో పూర్తిగా వసూలు చేయాలని స్పష్టం చేశారు. వ్యవసాయ కనెక్షన్లు తీసుకున్న రైతుల బ్యాంకు ఖాతా నంబరల్లను తిరుపతి డిస్కం కార్యాలయానికి పంపించాలని సూచించారు.

అసమ్మతి గళం

అనుకున్నదొకటి.. అయ్యింది మరొకటి అన్నట్లు యువగళం పాదయాత్రతో కేడర్‌లో జోష్ నింపాలని చినబాబు భావిస్తే.. ఉన్న నేతలే పార్టీ నుంచి వెళ్లితున్నారు. కార్యకర్తల్లో ఉత్సాహం నింపాలని ఆలోచిస్తే.. సరైన గౌరవం దక్కలేదని సీనియర్లు గుర్రుమంటున్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలకు శ్రేణులను సిద్ధం చేద్దామనుకుంటే.. ఇన్నేళ్లు వెన్నుదన్నుగా నిలిచిన నాయకులు జెండా వదిలేస్తున్నారు. అడుగుపెట్టిన ప్రతి నియోజకవర్గంలోనూ లోకేష్ తన అవగాహనరాహిత్యంతో తమ్ముళ్ల మధ్య చిచ్చుపెట్టేస్తున్నారు. ప్రధాన కార్యదర్శి హోదాలో పార్టీని బలోపేతం చేయడం సంగతి దేవుడెరుగు.. వర్గపోరును రాజేసి విభేదాలు సృష్టిస్తున్నారు. చినబాబు వ్యవహారశైలి నచ్చక సీనియర్ నేతలు అసమ్మతి గళం వినిపిస్తున్నారు. ఒకరొకరుగా టీడీపీకి గుడ్‌బై చెప్పేస్తున్నారు.



- భరోసా ఇవ్వని లోకేష్ పాదయాత్ర
- మరింత నిస్తేజంలో టీడీపీ శ్రేణులు
- పార్టీకి దూరమవుతున్న సీనియర్ నేతలు
- కొత్తగా వచ్చిన వారికి ప్రాధాన్యత ఇవ్వడంపై ఆగ్రహం

సాక్షి, చిత్తూరు : నిస్తేజంలో ఉన్న తెలుగుదేశం పార్టీకి ఉత్సాహం తీసుకురావాలనే ఉద్దేశంతో ఆపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పేరుతో పాదయాత్ర చేపట్టారు. అది కూడా తన తండ్రి చంద్రబాబు ప్రాతినిత్యం వహిస్తున్న కుప్పం నుంచే జనవరి 27వ తేదీన ప్రారంభించారు. ఇప్పటి చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పాదయాత్ర పూర్తి చేశారు. అయినప్పటికీ పార్టీలో మాత్రం ఉత్తేజం ఏమాత్రం కనిపించటం లేదు. పార్టీ కేడర్‌కు లోకేష్ పాదయాత్ర భరోసా కల్పించలేకపోయింది. ఏ నియోజగవర్గంలోనూ పాదయాత్ర, సభలు సక్సెస్ అని చెప్పుకునే పరిస్థితి కనిపించలేదు. సామాజిక మాధ్యమాల్లో వెలవెలబోతున్న లోకేష్ సభల ఫొటోలు, వీడియోలు హల్‌చల్ చేస్తూనే ఉన్నాయి. ఇలాంటివాటిపై స్వయంగా లోకేష్ ఆ పార్టీ సీనియర్ నేతలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. దీంతో పెయిడ్ ఆర్టిస్టులు, జనాలను వాహనాల్లో తీసుకొచ్చి పాదయాత్ర కొనసాగించటంలో నేతలు తలమునకలయ్యారు. అయినప్పటికీ స్పందన లేకపోవడంతో పాదయాత్రకు ఎక్కడికక్కడ బ్రేక్ తీసుకుంటూ కొనసాగిస్తున్నారు.

ఆగ్రహంలో సీనియర్లు

టీడీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీ జెండాను కొందరు నేతలు మోస్తూనే ఉన్నారు. కష్టకాలంలోనూ కొందరు సీనియర్లు ఆ పార్టీని వీడలేదు. కానీ, లోకేష్ చేపట్టిన పాదయాత్ర అలాంటి వారిని డైలమాలో పడేసిందనడంతో ఏమాత్రం సందేహం లేదు. అంతగా రాజకీయ అనుభవం లేని లోకేష్ పార్టీలోని సీనియర్లను చిన్నచూపు చూస్తున్నారనే వాదన వినిపిస్తోంది. నిన్నమొన్న పార్టీలోకి వచ్చిన కొత్త ముఖాలకు బాధ్యతలన్నీ అప్పగించటంపై కొందరు సీనియర్లు తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతున్నారు. తమకు ఏమాత్రం ప్రాధాన్యత ఇవ్వకపోవడంపై ఆవేదన చెందుతున్నారు. సమయం చూసి తమ అసమ్మతి గళం వినిపించేందుకు సన్నద్ధమవుతున్నట్లు సమాచారం.

సందీప్ దారిలో మరికొందరు?

టీడీపీ అధినేత చంద్రబాబు కుటుంబానికి మహదేవ సందీప్‌నాయుడు చాలా దగ్గర. ఒకప్పుడు ఆయన తండ్రి మహదేవ నాయుడు అయితే చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడు. ఆ కారణంగానే సందీప్‌కు రాష్ట్ర కార్యదర్శి పదవి దక్కింది. అయితే లోకేష్ పాదయాత్రలో ఆయనకు పూర్తి తిరస్కారమే ఎదురైంది. దీంతో బీసీ నేతలు సిపాయి సుబ్రమణ్యం , షణ్ముగం వెళ్లిన దారినే ఆయన ఎంచుకున్నారు. పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. చంద్రబాబుతో సన్నిహితంగా ఉండే సందీప్ నాయుడే అలాంటి నిర్ణయం తీసుకునే పరిస్థితి ఏర్పడితే? భవిష్యత్‌లో తమకూ ఇక్కట్లు రావచ్చని పలువురు నేతలు అనుకుంటున్నట్లు తెలిసింది. చేతులు మరింతగా కాలకముందే ఏదో ఒక నిర్ణయం తీసుకునేందుకు మంతనాలు సాగిస్తున్నట్లు సమాచారం.

టికెట్‌కు లేని భరోసా

రాబోయే సాధారణ ఎన్నికల్లో టికెట్ ఆశిస్తున్న నేతలు లోకేష్ పాదయాత్రలోముందుంటున్నారు. కానీ, టికెట్ వస్తుందని ఆశిస్తున్న నేతలకు లోకేష్ ఏమాత్రం హామీ ఇవ్వటం లేదు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ఒకరిద్దరు మినహా మిగిలిన వారికి మొండిచెయి చూపినట్టు ఆ పార్టీ నేతలే గుసగులాడుతున్నారు. టికెట్ ఇస్తారా..? లేదా..? అన్నది కూడా లోకేష్ తేల్చకపోవడంతో ఆశనిరాశల నడుమ ఊగిసలాడుతున్నారు.

ఐఎఫ్‌పీ బోర్డుపై అవగాన అవసరం



మాట్లాడుతున్న డీఈఓ శేఖర్

పుత్తూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన నూతన విద్యా విధానంలో భాగంగా బైజూస్ కంటెంట్, డిజిటల్, స్మార్ట్ పద్ధతిలో విద్యార్థులను తీర్చిదిద్దడానికి ఉపాధ్యాయులకు ఇన్‌ట్రాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ (ఐఎఫ్‌పీ)పై అవగాహన అవసరమని తిరుపతి జిల్లా డీఈఓ డాక్టర్ వి.శేఖర్ పేర్కొన్నారు. ఐఎఫ్‌పీ విద్యా విధానం అందుబాటులో ఉన్న స్థానిక సైప్రస్ స్కూల్‌లో ఉపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోనూ విద్యావిధానం కొనసాగుతోందన్నారు. ఇందులో భాగంగా ఐఎఫ్‌పీ బోర్డు విధానం త్వరలోనే జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలల్లో ప్రారంభించనున్నట్లు చెప్పారు. అనంతరం సైప్రస్ పాఠశాల కరస్పాండెంట్ చంద్రశేఖర్ ఐఎఫ్‌పీ బోధన విధానాన్ని వివరించారు. డీవైఈఓ రఘురామయ్య, డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ చెంగల్రాజు, ఎంఈఓ తిరుమలరాజు, పుత్తూరు, వడమాలపేట, నారాయణవనం మండలాలకు చెందిన 40 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెకానిజంలోనూ పట్టు సాధించండి



సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు

తిరుపతి అర్బన్: డ్రైవింగ్‌లో మెలకువలే కాకుండా మెకానిజంలోనూ పట్టు సాధించాలని తిరుపతి జిల్లా డెప్యూటీ చీఫ్ మెకానిక్ ఇంజినీర్ నరసింహులు పిలుపునిచ్చారు. అలిపిరి డిపోలోని డ్రైవింగ్ స్కూల్‌లో 18వ బ్యాచ్ శిక్షణ పూర్తి కావడంతో వారికి శుక్రవారం వీడ్కోలు పలికారు. అలాగే 19వ బ్యాచ్‌కి స్వాగతం పలికి, శిక్షణ ప్రారంభించారు. ఈనెల 5వ తేదీ నుంచి 20వ బ్యాచ్‌కి దరఖాస్తులు ఆహ్వానించారు. డెప్యూటీ సీఎంఈ మాట్లాడుతూ జిల్లాలో ఏకైక డ్రైవింగ్ స్కూల్ అలిపిరి డిపో మాత్రమేనన్నారు. మూడేళ్లుగా ఈ స్కూల్‌ను దిగ్విజయంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటి వరకు 18 బ్యాచ్‌లకు ఒక్కో బ్యాచ్‌లో 16 మంది చొప్పున 290 మందికి శిక్షణ ఇవ్వడంతోపాటు వారికి సరిఫికెట్లు జారీ చేసినట్టు తెలిపారు. తిరుపతి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సుబ్రమణ్యం మాట్లాడుతూ హెవీ డ్రైవింగ్‌కు దేశవిదేశాల్లో సైతం భలే గిరాకీ ఉందన్నారు. అలిపిరి డిపో మేనేజర్, డ్రైవింగ్ స్కూల్ ప్రిన్సిపల్ హరిబాబు మాట్లాడుతూ ఒక్కో బ్యాచ్‌కి 16 మందిని మాత్రమే ఎంపిక చేస్తున్నట్లు వెల్లడించారు. డ్రైవింగ్ స్కూల్ కో- ఆర్డినేటర్ టీ.రాము, శిక్షణా ప్రతినిధులు సీవీ గోపాల్, ఎస్.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా శిష్య స్వీకార మహోత్సవం

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ దేవి సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా శిష్య స్వీకార మహోత్సవం నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో విధులు నిర్వహిస్తున్న సురేష్ గురుకుల్‌కు శివగురువు డాక్టర్ స్వామినాథన్ గురుకుల్ ఆశీర్వాదంతో శివదీక్ష శిష్య స్వీకరణ జరిగింది. అనంతరం సురేష్ గురుకుల్ దంపతులకు కలశ తీర్థ అభిషేకం, పంచ హారతులు అందించారు. శాంతమ్మ, శ్రీకాళహస్తీశ్వర గురుకుల్, కృష్ణమూర్తి గురుకుల్ పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎన్నికల ఏర్పాట్లు



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ వెంకటేశ్వర్

చిత్తూరు కలెక్టరేట్ : పట్టభద్రులు, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లను జేసీ వెంకటేశ్వర్ శుక్రవారం పర్యవేక్షించారు. జిల్లాలోని బంగారుపాళ్యం, పలమనేరు, గంగవరం, పెద్దపంజాణి, వి.కోట, శాంతిపురం, రామకుప్పం, గుడుపల్లె, కుప్పం, పుంగనూరు, బైరెడ్డిపల్లె మండలాల్లో పర్యటించి పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఆయా సెంటర్లలో పకడ్బందీగా మౌలికవసతులు కల్పించాలని ఆదేశించారు.

బ్యాలెట్ పేపర్ల పంపిణీకి కసరత్తు

పట్టభద్రులు, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల బ్యాలెట్ పేపర్లను పకడ్బందీగా పంపిణీ చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, బాపట్ల జిల్లాల్లోని ఆర్డీఓలు బ్యాలెట్ పేపర్లను పకడ్బందీగా తీసుకెళ్లాలని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. ముద్రణ పూర్తి కాగానే ఆయా జిల్లాల ఆర్డీఓలకు చిత్తూరు కలెక్టరేట్‌లోనే పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

నేడు కౌంటింగ్ పర్సనల్స్‌కు శిక్షణ

ఎన్నికల కసరత్తులో భాగంగా శనివారం జెడ్పీ సమావేశ మందిరంలో కౌంటింగ్ పర్సనల్స్‌కు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు కలెక్టర్ హరినారాయణన్ తెలిపారు. చిత్తూరు, అన్నమయ్య జిల్లాలకు చెందిన 71 మంది కౌంటింగ్ పర్సనల్స్‌కు ఉదయం 10 గంటల నుంచి శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు

ఒత్తిడిని జయిస్తే పదిలమే!



పదోతరగతి పరీక్షలు నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. ఈ ఏడాది మెరుగైన ఫలితాలు రాబట్టేందుకు కార్యాచరణ అమలు చేస్తున్నారు. అందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించారు. నెలల తరబడి నేర్చుకున్న పాఠాలను ప్రణాళికాబద్ధంగా పునశ్చరణ చేసుకోవాలని సూచిస్తున్నారు. సామర్థ్యాల మేరకు అత్యుత్తమ మార్కులు సాధించేలా పిల్లలతో పక్కాగా ప్రిపరేషన్ చేయిస్తున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి మరింత శ్రద్ధతో పాఠ్యాంశాలు బోధించేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఒత్తిడిని జయించి..కీలకమైన పరీక్షల్లో ప్రతిభను కనబరిచే దిశగా నైపుణ్యాలకు మెరుగులు దిద్దుతున్నారు.

- ఏప్రిల్ 3 నుంచి పదోతరగతి పరీక్షలు
- ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టిన అధికారులు
- ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక ప్రణాళిక
- పకడ్బందీగా రివిజన్ తరగతులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా మొత్తం 21,996 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలు రాయనున్నారు. ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు జరగనున్న పరీక్షలకు విద్యాశాఖ అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎగ్జామ్స్‌కు సమయం సమీపిస్తుండడంతో పిల్లలు నిద్రాహారాలు మాని పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. ఈ క్రమంలోనే జిల్లాలోని మొత్తం 500 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులతో ఉపాధ్యాయులు పాఠ్యాంశాలను రివిజన్ చేయిస్తున్నారు. పక్కా ప్రిపరేషన్‌తో మంచి మార్కులు సాధించేందుకు దిశానిర్దేశం చేస్తున్నారు. ఎంఈఓలు, డీవైఈఓలు ఎప్పటికప్పుడు విద్యార్థుల సామర్థ్యాలను తనిఖీ చేస్తున్నారు. ఒత్తిడిని జయించేందుకు అనుసరించాల్సిన పద్ధతులను బోధిస్తున్నారు.

పరీక్షల సమయంలో ఆందోళనకు గురికాకుండా సమయాన్ని సద్వినియోగం చేసుకుంటే ఉత్తమ మార్కులు సాధించవచ్చని సూచిస్తున్నారు.

సమయ 'విభజన' ముఖ్యం

సమయాన్ని ఎంత తెలివిగా వినియోగించుకున్నామనే దానిపై సాధించే మార్కుల శాతం ఆధారపడి ఉంటుంది. సబ్జెక్టులు, టాపిక్‌ల ప్రాధాన్యతలను గుర్తించి టైమ్‌ను విభజించుకోవాలి. పరీక్షలు దగ్గర పడే కొద్దీ చాలామంది గంటల తరబడి పుస్తకాల ముందు కూర్చుంటారు. అలా కాకుండా అప్పుడప్పుడు విరామం ఇవ్వడం వల్ల మెదడుపై ఒత్తిడి తగ్గుతుంది.

రివిజన్.. కీలకం

విద్యార్థులు పరీక్షల సమయంలో తమకు రాని అంశాలపై ఎక్కువగా దృష్టిపెట్టి వచ్చిన వాటిని పట్టించుకోరు. ఎంత బాగా వచ్చిన అంశాలైనా కొన్నిరోజులకు మర్చిపోయే ప్రమాదం ఉంది. కాబట్టి విద్యార్థులు వచ్చిన అంశాలను కూడా తరచూ రివిజన్ చేయాలి. అన్ని పాఠశాలల్లో సిలబస్ పూర్తి కావడంతో రివిజన్ ఎంతో కీలకమని టీచర్లు వెల్లడిస్తున్నారు. పాఠ్యాంశాల్లో కష్టంగా భావించి విస్మరించిన అంశాలపై కొత్తగా దృష్టి పెట్టడం మంచిది కాదంటున్నారు. ఇప్పటికే పూర్తి స్థాయిలో నేర్చుకున్న అంశాల్లో మరింత పట్టు సాధించేలా సమయాన్ని వినియోగించుకోవాలని సూచిస్తున్నారు.

మార్కుల సాధనకు నిపుణుల సూచనలు

- ✔ పాఠ్యాంశాలను పక్కాగా రివిజన్ చేసుకోవాలి.కొత్త అంశాల జోలికి వెళ్లకూడదు.
- ✔ టైం టేబుల్ సిద్ధం చేసుకుని, అన్ని సబ్జెక్టు కవర్ అయ్యేలా చూసుకోవాలి. కష్టమైన సబ్జెక్టులకు ఎక్కువ సమయం కేటాయించాలి.
- ✔ రివిజన్‌లో ముఖ్యమైన పాయింట్లు రాసుకోవాలి.పరీక్షల సమయంలో క్విక్ రివిజన్‌కి ఉపయోగపడుతుంది.
- ✔ తోటి విద్యార్థులతో అప్పుడప్పుడు సబ్జెక్ట్‌లపై చర్చించుకోవాలి.
- ✔ పాత ప్రశ్న పత్రాలు, మోడల్ ప్రశ్నపత్రాలను ఎక్కువ ప్రాక్టీస్ చేయాలి.
- ✔ సమతుల ఆహారం తీసుకోవాలి. బయట ఫుడ్‌ను తీసుకోకపోవడం మంచిది.
- ✔ విరామమే లేకుండా చదవడం సరి కాదు. గంటకి ఒక 5 నిమిషాలు బ్రేక్ ఇచ్చి, మళ్లీ చదవాలి.
- ✔ ప్రశాంతంగా రోజుకి 6 నుంచి 7 గంటలు నిద్రపోవాలి.
- ✔ పూర్తి పాజిటివ్ మైండ్‌తో ఉండాలి.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

ఆరోగ్యంగా ఉన్నప్పుడే పిల్లలు ఆత్మవిశ్వాసంతో పరీక్ష రాయగలరు. అందువల్ల ప్రిపరేషన్‌లో పడి ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయకూడదు. జంక్‌ఫుడ్‌కి దూరంగా ఉండాలి. ప్రొటీన్లతో కూడిన ఆహారం తీసుకోవాలి. అలాగే తగిన నిద్రతోపాటు రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. ముఖ్యంగా ప్రశాంతంగా ఉండటం అలవాటు చేసుకోవాలి. మార్కులకు దోహదం చేసే చక్కటి చేతిరాతపైనా దృష్టి పెట్టాలి.

పిల్లలపై ప్రత్యేక దృష్టి



“సర్కారు బడుల్లో చదువుతున్న విద్యార్థులు పదోతరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక దృష్టి సారించాం. భయపడకుండా పరీక్ష రాసేలా కౌన్సెలింగ్ ఇచ్చాం. ఒత్తిడిని జయించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాం. వెనకబడిన విద్యార్థులపై ఆయా సబ్జెక్టు టీచర్లు మరింత శ్రద్ధ తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశాం. పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నాం. – **విజయేంద్రరావు, డీఈఓ, చిత్తూరు**

శేష వాహనంపై శ్రీవారి కటాక్షం


శేష వాహనంపై శ్రీవారు

సోమల: మండలంలోని ఆవులపల్లెలో టీటీడీ అనుబంధంలో ఉన్న శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీదేవి, భూదేవి సమేతంగా శేష వాహనంపై స్వామివారు భక్తులను అనుగ్రహించారు. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించారు. ఉభయదారులుగా ఆర్యవైశ్య సంఘం వారు వ్యవహరించారు.

రుయా అధికారులకు నోటీసులు

తిరుపతి తుడా : ఆరోగ్యశ్రీ ఆసరా నిధుల గోల్‌మాల్‌పై రుయా అధికారులకు పోలీసులు నోటీసులు జారీచేశారు. రుయా సూపరింటెండెంట్ నాగమునీంద్రుడుతోపాటు డాక్టర్ రాధారాణి, డాక్టర్ మునీశ్వరరెడ్డికి అలిపిరి సీఐ అబ్బన్న శుక్రవారం రాత్రి నోటీసులు అందజేశారు. అవతవకలపై పూర్తి వివరాలు అందించాలని కోరారు. ఆరోగ్యశ్రీని పరిరక్షించాల్సిన మెట్రికోపైన చర్యలకు దిగనున్నారు. ఆయా శాఖల అధికారుల నిర్లక్ష్యాన్ని ఉన్నతాధికారులు గుర్తించారు.

చిరుత కలకలం

పాకాల: మండలంలోని లింగనపల్లి పంచాయతీ పరిధిలో శుక్రవారం చిరుత సంచరిస్తూ కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు ఆటో డ్రైవర్ రమేష్ శుక్రవారం ఉదయం 5 గంటల ప్రాంతంలో పెనుమూరు వెళుతుండగా సబ్‌స్టేషన్ సమీపంలో చిరుత రోడ్డుకు తూర్పు నుంచి పడమర వైపు వస్తోంది. ఆటో లైట్ వెలుతురు పడడం, హారన్ వేయడంతో వెనుదిరిగి గుట్టలోకి వెళ్లిపోయినట్లు తెలిపారు. సమాచారాన్ని వెంటనే అటవీ సిబ్బందికి సమాచారం అందజేశారు. ఉదయం 11 గంటలకు అటవీ సిబ్బంది అక్కడకు చేరుకుని పరిసరాలను పరిశీలించి చిరుత సంచారం ఉందని గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. అచ్చమ్మ అగ్రహారం, గాండ్లపల్లి, లింగనపల్లి, కవాలివారిపల్లి గ్రామస్తులు జాగ్రత్తగా ఉండాలని అటవీ అధికారులు సూచనలు చేశారు.

పోషణ కరువై.. బతుకు భారమై!

అన్నదమ్ములు రాము,శివ



పొట్టపై దద్దుర్లు చూపుతున్న రాము



ఆటపాటలతో సాగిపోవాల్సిన బాల్యం అష్ట కష్టాలు పడుతోంది.. చదువుసంధ్యల్లో మునిగిపోవాల్సిన వయసులో చిన్నాచితకా పనులతో చితికిపోతోంది.. పట్టించునేవారు లేక.. పోషణ కరువై పసితనం బక్కచిక్కిపోయింది..వదిలేసి వెళ్లిపోయిన తల్లి బాధ్యతారాహిత్యం.. తాగుడికి బానిసగా మారిపోయిన తండ్రి నిర్లక్ష్యం కారణంగా దయనీయస్థితిలో కొట్టుమిట్టాడుతున్న ఆ అన్నదమ్ములను చూస్తే ఎవరికైనా గుండెచెరువుగా మారుతుంది. తిండీతిప్పలు కూడా సక్రమంగా లేని గిరిజన బిడ్డల దీనస్థితి మనసుని కదలిస్తుంది.


చిన్నారులు ఉంటున్న ఇల్లు

- అభాగ్యులుగా మారిన అన్నదమ్ములు
- వదిలేసి వెళ్లిన తల్లి.. పట్టించుకోని తండ్రి
- బడి మానేసి చిన్నాచితకా పనులతో కాలక్షేపం
- సక్రమంగా తిండీ, స్నానం లేక అనారోగ్యం
- దుర్భరంగా జీవిస్తున్న పసివాళ్లు

వి.కోట/పలమనేరు : వి.కోట సమీపంలోని మిట్టూరులో చిన్నన్న (48), రాధమ్మ (43) దంపతులు కూలి పనులు చేసుకుంటూ పొట్టపోసుకునేవారు. వీరికి రాము(12), శివ(9) ఇద్దరు కుమారులతోపాటు ఓ కుమార్తె(5) ఉంది. చిన్నన్న సక్రమంగా పనిచేయకపోవడం, కుటుంబాన్ని పట్టించుకోకపోవడంతో కటిక పేదరికాన్ని అనుభవించారు. దీంతో రాధమ్మ తన కుమార్తెను తీసుకుని రెండేళ్ల క్రితం ఎటో వెళ్లిపోయింది. దీంతో ఇద్దరు కుమారులకు తండ్రే దిక్కుగా మారాడు. మద్యానికి బానిసగా మారిన చినన్న తన పిల్లలను గాలికి వదిలేశాడు. అప్పుడప్పుడు కూలికి వెళితే వచ్చిన సొమ్మును కూడా తాగేసేవాడు. కేవలం ప్రభుత్వం పంపిణీ చేసే రేషన్ బియ్యమే పిల్లలకు ఆధారమైంది. సబ్బు కొనుక్కునే స్తోమత లేక వారానికో.. పదిరోజులకో గ్రామ సమీపంలోని కాలువలో మునిగేసి స్నానం అయ్యిందనిపించేవారు. బడికి వెళ్లడం కూడా మానేశారు. ఊళ్లో తిరుగుతూ ఎవరైనా పని చెబితే చేసిపెట్టి వారిచ్చే పదోపరకో పుచ్చుకుని కడుపు నింపుకునేవాళ్లు. అన్నం వండుకోవడం కూడా సరిగా రాక నానా అవస్థలు పడుతున్నారు. ఓ పూట వండిన అన్నాన్నే నాలుగైదు రోజులు పెట్టుకు తింటున్నారు. చిన్నపాటి గదిలో అపరిశుభ్ర వాతావరణంలోనే నివసిస్తున్నారు.

అనారోగ్యం బారిన పడి..

కొన్నాళ్లుగా సరైన ఆహారంలేక, పాచిపోయిన అన్నం తిని, స్నానం చేయక అన్నదమ్ములు అనారోగ్యానికి గురైయ్యారు. శరీరంపై దద్దుర్లు రావడంతో తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. శుక్రవారం వారి పరిస్థితిని చూసిన సమీప బంధువు ఒకరు వి.కోట ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించాడు. నిరక్షరాస్యులు ఎక్కువగా ఉన్న ఆ గ్రామంలో ఎవరూ వీరిని పట్టించుకోలేదు. కనీసం అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లలేదు. డ్రాప్ అవుట్లను గుర్తించే ప్రక్రియలో భాగంగా విద్యాశాఖ సిబ్బందికి సైతం వారి ఇంటికి వెళ్లలేదు. చివరకు గ్రామ వలంటీర్ కూడా ఈ పిల్లల దయనీయస్థితిపై దృష్టి పెట్టలేదు. ఇప్పటికైన మండల అధికారులు స్పందించి ఈ గిరిజన బిడ్డలను సంక్షేమ వసతి గృహంలో చేర్పిస్తే మంచిదని స్థానికులు కోరుతున్నారు.


ఇంటిలోని పరిస్థితి ఇది

ఆ బిడ్డల కష్టం చూడలేకపోతున్నాం



తల్లి ఎక్కడెకెళ్లిందో తెలియదు. తండ్రి పిల్లలను సరిగ్గా పట్టించుకోడు. వారు బడికెళ్లడంలేదు. పూట చేసిన అన్నాన్ని నాలుగురోజులు తింటున్నారు. అప్పుడప్పుడు మేం అన్నం, చారు ఇస్తుంటాం. స్నానం లేక వళ్లంతా దద్దులు వచ్చాయి. బిడ్డలను చూస్తే బాధేస్తుంది. అధికారులైనా స్పందించి వారికి చదువు, హాస్టల్ సౌకర్యం కల్పిస్తే బాగుంటుంది.

– రాధ, పక్కింటి మహిళ, మిట్టూరు

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

పలమనేరు: పట్టణంలోని పెట్రోల్ బంకు సమీపంలోని మంచినీళ్ల ట్యాంకుకు సుమారు 36 సంవత్సరాల వయసు కలిగిన వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం రాత్రి పది గంటల ప్రాంతంలో వెలుగుచూసింది. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ నాగరాజు మృతిని బట్టలను పరిశీలించారు. అందులో చింపివేసి ఉన్న ఆధార్ నంబర్ దొరికింది. దీన్ని బట్టి చూడగా అతను వెదురుకుప్పం మండలం పాతగుంట రాజారెడ్డిగా ఉంది. అయితే దీనిపై పూర్తి విచారణ చేశాక మృతుని వివరాలు వెల్లడించనునట్టు తెలిపారు. మృతదేహాన్ని గుర్తించినవారు 9440796734 సెల్ నంబర్‌కు సమాచారాన్ని ఇవ్వాలని పలమనేరు ఎస్‌ఐ నాగరాజు సూచించారు.

తల్లీబిడ్డలు అదృశ్యం

రామకుప్పం: మండలంలోని ననియాల గ్రామంలో తల్లీబిడ్డల అదృశ్యంపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ కృష్ణయ్య కథనం మేరకు.. ఆర్ముగం అనే వ్యక్తి డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గత నెల 24వ తేదీ సాయంత్రం డ్యూటీ ముగించుకుని ఇంటికి వచ్చేసరికి అతడి భార్య యశోద(26), పిల్లలు కావ్య(6), రామ్‌ప్రసాద్(4) కనిపించలేదు. పెద్ద కూతురు కీర్తి(8) మాత్రం ఆరు బయట ఆడుకుంటోంది. చుట్టుపక్కల గాలించినా భార్యాబిడ్డల ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రామకుప్పంలో..

మండలకేంద్రంలో తల్లీబిడ్డ అదృశ్యమైన ఘటన శుక్రవారం కేసు నమోదైంది. వివరాలు.. భాగ్యరాజా తన భార్య కావేరి (25), కుమార్తె దీపిక (7)తోపాటు అత్తతో కలసి నివసిస్తున్నాడు. భాగ్యరాజా, అత్త కూలిపనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈక్రమంలో కూలి పని ముగించుకుని మధ్యాహ్నం భోజనానికి ఇంటికి రాగా భార్యాబిడ్డలు కనిపించలేదు. చుట్టుపక్కల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో భాగ్యరాజా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు.

ఏఆర్ కానిస్టేబుల్‌పై ఫిర్యాదు

పలమనేరు: పట్టణానికి చెందిన నలుగురిపై దౌర్జన్యానికి పాల్పడిన ఏఆర్ కానిస్టేబుల్ నవీన్‌కుమార్‌పై శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు అందింది. బాధితుడు కిషోర్ మాట్లాడుతూ రెండు రోజుల క్రితం తన స్నేహితులు కృష్ణప్రసాద్, సుహేబ్, రంజిత్‌తో కలిసి ఓ శుభకార్యానికి వెళ్లి వస్తుండగా నవీన్‌కుమార్ దౌర్జన్యం చేశాడని పేర్కొన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ - ఒకరి మృతి


మృతి చెందిన లాల్‌బాషా

చంద్రగిరి: ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటలో ఒకరు మృతి చెందగా, మరొకరు గాయపడిన ఘటన పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారి తొండవాడ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. చిత్తూరుకు చెందిన లోకేష్ తిరుపతిలోని ఓ ప్రైవేటు కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం చిత్తూరు నుంచి విధులకు హాజరయ్యేందుకు తన ద్విచక్ర వాహనంలో తిరుపతికి పయనమయ్యాడు. ఈ క్రమంలో చంద్రగిరి ఇందిరమ్మ కాలనికి చెందిన లాల్‌బాషా(35) మరో వృద్ధుడితో కలిసి ద్విచక్ర వాహనంలో చంద్రగిరి వైపుగా వస్తున్నాడు. ఈ క్రమంలో తొండవాడ సమీపంలో ఎదురుగా వస్తున్న లోకేష్ ద్విచక్ర వాహనాన్ని లాల్ బాషా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన లాల్ బాషా అక్కడికక్కడే మృతిచెందగా.. మరో వృద్ధుడు, లోకేష్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. చంద్రగిరి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను తిరుపతి రుయాకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలుడి ఆత్మహత్య

కేవీబీపురం: కేవీబీపురం దళితవాడలో శుక్రవారం బాలుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. దళితవాడకు చెందిన చంద్రయ్య కుమారుడు వంశీ(16) కూలి పనులు చేస్తూ తల్లిదండ్రులకు ఆసరాగా ఉంటున్నాడు. ఏమి జరిగిందో కాని శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సునీల్ తెలిపారు.

వేర్వేరుచోట్ల ఎర్రచందనం పట్టివేత


నిందితుడి అరెస్ట్ చూపుతున్న అటవీశాఖ అధికారులు

- ఒకరి అరెస్టు, మూడు వాహనాల సీజ్

రొంపిచెర్ల: వేర్వేరు చోట్ల అక్రమంగా తరలిస్తున్న ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు పీలేరు సంచార దళ నిఘా విభాగాధికారి డీఏ కిరణ్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ. మండలంలోని మల్లెలక్రాస్ వద్ద ఇన్నోవా కారులో తరలిస్తున్న 7 ఎర్రచందనం దుంగలు, పైలెట్ వాహనంగా వస్తున్న బైక్‌ను సీజ్ చేశామన్నారు. అలాగే పూతలపట్టు దగ్గర కారులో తరలిస్తున్న 8 ఎర్రచందనం దుంగలు పట్టుబడినట్లు వెల్లడించారు. డ్రైవర్ కామరాజు నటరాజన్‌ను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. స్వాధీనం చేసుకున్న వాహనాలతో సహా ఎర్రచందనం విలువ సుమారు రూ.22లక్షలు ఉంటుందని వివరించారు. దాడుల్లో ఫారెస్టు రేంజ్ అధికారి వెంకటరమణ, ఎఫ్‌బీఓలు కె. ప్రతాప్, కుప్పుస్వామి, సిబ్బంది ప్రభుతేజ, చరణ్‌పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధనకు కృషి చేయండి


విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న డీఈఓ విజయేంద్రరావు

వెదురుకుప్పం: పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలని డీఈఓ విజయేంద్రరావు అన్నారు. శుక్రవారం మండలంలోని దేవళంపేట జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీఈఓ మాట్లాడుతూ పదోతరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించి ఉత్తమ మార్కులతో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. అలాగే సాయంత్రం పిల్లలకు అల్పాహారాన్ని అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థులను ప్రశ్నించి, సామర్థాలను పరీక్షించారు. ప్రతి ప్రశ్నకు విద్యార్థులు సమాధానం చెప్పడంతో సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాల రికార్డులను పరిశీలించారు. డీఈఓ వెంట హెచ్‌ఎం సుందరేష్, పీసీ చైర్మన్ ఉమాపతి ఉన్నారు.

పరీక్షల్లో మార్కులు తగ్గాయని..


విద్యార్థిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

వెదురుకుప్పం : పరీక్షల్లో మార్కులు తక్కువగా వచ్చాయని ఓ విద్యార్థి పాఠశాల నుంచి పారిపోయిన ఘటన శుక్రవారం కలకలం రేపింది. ఎస్‌ఐ దస్తగిరి కథనం మేరకు.. మండలంలోని తిరుమలయ్యపల్లెకు చెందిన రామచంద్రుడు కుమారుడు రెడ్డి దేవేంద్ర దేవళంపేటలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో పదోతరగతి చదువుతున్నాడు. పాఠశాలలో ఇటీవల పరీక్షలు నిర్వహించగా దేవేంద్రకు తక్కువ మార్కులు వచ్చాయి. ఈ విషయం తల్లిదండ్రులకు తెలిస్తే కోప్పడతారన్న భయంతో విద్యార్థి శుక్రవారం వేకువజామునే స్కూల్ హాస్టల్ నుంచి వెళ్లిపోయాడు. దీంతో తలిదండ్రులు స్కూల్ వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. విద్యార్థి అదృశ్యంపై పాఠశాల కరస్పాండెంట్ గుణశేఖర్ వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో పెద్దబైలు వద్ద సంచరిస్తున్న దేవేంద్రను పోలీసులు పట్టుకుని బాలుడి తల్లిదండ్రులకు అప్పగించారు.

శ్రీరామ.. ఓ రామ!

పండితుల వేదమంత్రాలు.. భక్తుల గోవింద నామస్మరణ మార్మోగుతుండగా పుష్కరిణిలో శ్రీమలయప్ప స్వామి సీతాలక్ష్మణ ఆంజనేయ సమేత శ్రీరామచంద్రమూర్తి అలంకరణలో విహరిస్తూ కనువిందు చేశారు. తిరుమలలో శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలు శుక్రవారం సాయంత్రం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తెప్పలపై జల విహారం చేస్తున్న స్వామి, అమ్మవార్లను వీక్షించి తరించారు. గోవిందుడిని స్మరిస్తూ ఆధ్యాత్మిక ఆనందంలో మునిగితేలారు. ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఉత్సవర్లు ఊరేగుతుండగా కర్పూరనీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.

– తిరుమల


అశేష జనవాహిని మధ్య తెప్పోత్సవం
(ఇన్‌సెట్) తెప్పపై శ్రీరామచంద్రమూర్తి అలంకరణలో మలయప్ప



ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించండి

యాదమరి: గ్రామీణ ప్రజలు ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి అనిల్‌కుమార్ నాయక్ తెలిపారు. మండలంలోని దాసరాపల్లె ఆరోగ్య ఉపకేంద్రం పరిధిలోని గ్రామాలలో శుక్రవారం ఆయన సిబ్బందితో కలిసి డ్రైడే నిర్వహించారు. గ్రామాలలో పారిశుధ్యం అధ్వానంగా వీధులను శుభ్రం చేయించి పెనాయిల్ చల్లారు. అనంతరం గ్రామీణ ప్రజలతో మాట్లాడుతూ నిల్వ ఉంచిన నీటిని ప్రతి శుక్రవార కిందపోసి ఆ పాత్రలను బాగా ఆరబెట్టాలని సూచించారు. జ్వరాలు ఎక్కువగా వ్యాపిస్తున్నందున నీటిని కాచి చల్లార్చి తాగాలని చెప్పారు. జ్వరాలు సోకిన వారు వెంటనే చికిత్సలు చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ హాస్టల్లో జాడ లేని వార్డెన్

పూతలపట్టు: మండలంలోని పి.కొత్తకోట బీసీ హాస్టల్‌లో వార్డెన్ అందుబాటులో లేరని ఎంపీడీఓ గౌరి తెలిపారు. ఆమె శుక్రవారం సాయంత్రం తహసీల్దార్ విజయభాస్కర్‌తో కలిసి హాస్టల్‌ను తనిఖీ చేశారు. వారిద్దరూ 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. ప్రభుత్వం అన్ని విధాలా సదుపాయాలు కల్పిస్తుంటే హాస్టల్ సిబ్బంది వాటిని దుర్వినియోగం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పరీక్షల సమయంలో వార్డెన్, విద్యార్థులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. లేని పక్షాన ఉన్నత అధికారులకు నివేదించి, శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. 10వ తరగతి విద్యార్థులు ఉత్తీర్ణత సాధించాలని కోరారు.

పిల్లలందరినీ బడికి పంపించాలి

మండలంలోని కూటుంవారిపల్లి ఎస్టీ కాలనీని పరిశీలించిన అధికారులు విద్యార్థులతో మాట్లాడారు. ముందుగా ఆధార్ కార్డులు అప్‌డేట్ లేకుంటే కొత్తవి నమోదు చేయించుకోవాలని సూచించారు. తద్వారా రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పిల్లలందరినీ బడికి పంపించాల్సిన బాధ్యత వలంటీర్లు, డిజిటల్ అసిస్టెంట్లదేనని స్పష్టం చేశారు. ఎస్టీ కాలనీలో పిల్లలు ఇంటి దగ్గర కనిపించకూడదని అధికారులు తల్లిదండ్రులకు, సచివాలయ సిబ్బందికి ఆదేశించారు. ఆధార్, రేషన్ కార్డు, ఓటరు కార్డు, మొదలైన నమోదు ప్రకియలు అందుబాటులోకి తీసుకొస్తాం అని గ్రామస్తులకు అధికారులు తెలియజేశారు.


ఎస్టీ కాలనీ పిల్లలతో మాట్లాడుతున్న తహసీల్దార్ విజయభాస్కర్, ఎంపీడీవో గౌరి

పేదల చెంతకే వైద్యసేవలు

ఐరాల: పేదల చెంతకే వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని 35 యర్లంపల్లె పంచాయతీలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 80 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మధ్యాహ్న సమయంలో గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు ఎత్తు, బరువు, వైద్య పరీక్షలు నిర్వహించారు. బరువు తక్కువగా ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులను పిలిచి సరైన పోషకాహారం అందించేలా చూడాలని అవగాహన కల్పించారు. అనంతరం ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్ చేయించుకున్నవారి ఇంటి వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుని వైద్య సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలి

తవణంపల్లె: ఉపాధ్యాయులు విద్యార్థుల స్థాయిని గుర్తించి తదనుగుణంగా గుణాత్మక విద్య అందించడానికి కృషి చేయాలని ఎంఈఓ శంకరయ్య తెలిపారు. మండలంలోని కొత్తగొల్లపల్లె ప్రాథమికోన్నత పాఠశాల, కర్ణంవాండ్లవూరు ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం ఎంఈఓ తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, పాఠశాల రికార్డులను, పరిసరాల శుభ్రతను పరిశీలించారు. తరగతి గదిలో విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. విద్యార్థుల చదువుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎంఈఓతోపాటు హెచ్‌ఎంలు మంజుల, బాలచంద్రారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.










కె. రామలక్ష్మి

తెలుగు సాహిత్యలోకం నుంచి రచయిత్రి కె.రామలక్ష్మి (92) వీడ్కోలు తీసుకున్నారు. రచయిత్రిగా, ఆరుద్ర సతీమణిగా, మద్రాసు (చెన్నై) నగరంలో తెలుగువారి ప్రతినిధిగా, నాటి సాహితీ సమూహాలలో కీలకమైన వ్యక్తిగా, సినిమా రంగంలో రచయిత్రిగా ఆమె సాగించిన యాత్ర సుదీర్ఘమైనది. ఆమె మరణంతో ఒక కాలపు తెలుగు సాహితీ చరిత్రకు మిగిలిన ఆఖరు సాక్షి లేకుండా పోయినట్టయ్యింది.

నివాళి

ఆమె ప్రతి అక్షరం స్త్రీ పక్షం

రచయిత్రి రామలక్ష్మి ఆరుద్ర కన్నుమూత

- అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నివాసంలో మృతి
- 100 కుపైగా పుస్తకాలు రాసిన రామలక్ష్మి
- జీవనజ్యోతి సినిమాకు ఉత్తమ కథా రచయితగా నంది అవార్డు
- జర్నలిస్టుగా, సెన్సార్ బోర్డు సభ్యురాలిగా సేవలు

ప్రముఖ రచయిత ఆరుద్ర సతీమణి కె.రామలక్ష్మి (92) కన్నుమూశారు. కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె.. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆస్మాన్‌ఘడ్‌లో ఉన్న నివాసంలో తుదిశ్వాస విడిచారు. రామలక్ష్మి ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ జిల్లా కోటనందూర్‌లో 1930 డిసెంబర్ 31న జన్మించారు. మద్రాస్ విశ్వవిద్యాలయంలో బీఏ పూర్తిచేశారు. ఆంగ్ల, ఆంధ్ర సాహిత్యం, ప్రాచీనాంధ్ర సాహిత్యం అభ్యసించారు. 1954లో ప్రముఖ కవి ఆరుద్రను వివాహం చేసుకున్నారు. వీరికి ఐదుగురు కుమార్తెలు. 1951 నుంచే రామలక్ష్మి రచనా ప్రస్థానం మొదలైంది. వివాహమైన తర్వాత 'రామలక్ష్మి ఆరుద్ర' కలం పేరుతో రచనలు చేశారు. మొత్తం 100 కు పైగా పుస్తకాలు రాశారు. ఆంధ్రపత్రికలో ఆమె సుదీర్ఘకాలం నిర్వహించిన 'ప్రశ్న జవాబు' శీర్షిక ప్రసిద్ధి చెందింది. విడదీసే రైలుబళ్లు, అవతలిగట్టు, మెరుపుతీగె, తొణికిన స్వర్గం, మానని గాయం, ఆణిముత్యం, పెళ్లి, ప్రేమించు ప్రేమకై, ఆడది, ఆశకు సంకెళ్లు, కరుణ కథ, లవంగి, ఆంధ్ర నాయకుడు, పాండురంగని ప్రతిజ్ఞ, నీదే నా హృదయం, అద్దం, ఒక జీవికి స్వేచ్ఛ వంటి కథా సంకలనాలను రామలక్ష్మి రచించారు. తెలుగు సాహిత్య రంగానికి చేసిన సేవలకు గాను ఆమెకు గృహలక్ష్మి, స్వర్ణకంకణం సహా పలు ప్రతిష్టాత్మక పురస్కారాలు దక్కాయి.

ఉత్తమ రచయిత్రిగా నంది అవార్డు...

రామలక్ష్మి పలు సినిమాలకు కథలు అందించారు. 1975వ సంవత్సరంలో జీవన జ్యోతి సినిమా కథకు గాను అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి నంది అవార్డు అందుకున్నారు. కాసా సుబ్బారావు నిర్వహించిన స్వతంత్ర దినపత్రికలో జర్నలిస్టుగా పని చేశారు. 1978లో ఉత్తమ జర్నలిస్టుగా రామానాయుడు అవార్డు అందుకున్నారు. పలు స్త్రీ సంక్షేమ సంఘాల్లో సేవలు అందించి మహిళల శ్రేయస్సు కోసం పాటుపడ్డారు. కేంద్ర ఫిల్మ్ సెన్సార్ బోర్డ్ రీజనల్ ప్యానెల్ సభ్యురాలిగా కూడా పనిచేశారు. రామలక్ష్మి ఆరుద్ర మృతిపట్ల పలువురు రచయితలు, సినీ, రాజకీయ, ఇతర రంగాల ప్రముఖులు సంతాపం తెలిపారు. శుక్రవారం సాయంత్రమే ఎస్ఆర్‌నగర్ శ్మశానవాటికలో ఆమె అంత్యక్రియలను నిర్వహించారు.

స్టెల్లా మేరీ స్టూడెంట్

స్వస్థలం కాకినాడ అయినా కె.రామలక్ష్మి చదువు చెన్నైలోనే సాగింది. స్టెల్లా మేరీ కాలేజీలో చదువుకుని ఇంగ్లిష్ భాషలో పట్టు సాధించారు. 'ఐ యామ్ ఏ స్టెల్లామేరియన్' అని గర్వంగా చెప్పుకునేవారు. కాలేజీలో ఒక కార్యక్రమానికి అతిథిగా హాజరైన ప్రఖ్యాత జర్నలిస్టు ఖాసా సుబ్బారావు ఇంగ్లిష్‌లో ఉపన్యాసం ఇచ్చిన కె.రామలక్ష్మిని చూసి పరీక్షలు అయిపోయాక తనని కలవమని చెప్పారు. 'స్వతంత్ర' పత్రికలో ఇంగ్లిష్ విభాగంలో పాత్రికేయురాలిగా ఉద్యోగం ఇచ్చారు. 'తెలుగు స్వతంత్ర'కు ఎడిటర్‌గా ఉన్న ఖాసా సుబ్బారావు కోరిక మేరకు 'నడుస్తున్న చరిత్ర' కాలమ్ రాశారు రామలక్ష్మి. ఆమె ఇంటిలో ప్రతి సాయంత్రం సాహితీచర్చలు జరిగేవి. వాటికి ఆరుద్ర, శ్రీరంగం నారాయణబాబు, శ్రీశ్రీ తదితరులు హాజరయ్యేవారు. ఆరుద్ర, రామలక్ష్మి పరస్పరం ఇష్టపడి ఆ రోజుల్లో అంటే 1954ఏప్రిల్30న రిజిస్టర్డ్ మేరేజీ చేసుకున్నారు. ఈ పెళ్లికి దర్శకుడు హెచ్.ఎం.రెడ్డి, శ్రీశ్రీ సాక్షి సంతకాలు చేశారు. శ్రీశ్రీ తన పెళ్లికి సాక్షి సంతకం చేయాలని ఆరుద్ర భావించడం వల్ల ఇది జరిగింది. శ్రీశ్రీ రామలక్ష్మిని 'అత్తగారు' అని సరదాగా పిలిచేవారు. అయితే శ్రీశ్రీ ధోరణిని రామలక్ష్మి చివరి వరకూ వ్యతిరేకిస్తూనే వచ్చారు.


కుమార్తెలు విజయ, త్రివేణి, కవిత, లలిత, వాసంతిలతో ఆరుద్ర, రామలక్ష్మి

ఆరుద్రకు అండా దండా

ఆరుద్ర సినిమా రంగంలో కృషి చేయడానికి, 'సమగ్రాంధ్ర చరిత్ర' పరిశోధన పూర్తి చేయడానికి రామలక్ష్మి అందించిన అండదండలే కారణం. వీరికి ఐదుగురు కుమార్తెలు విజయ, త్రివేణి, కవిత, లలిత, వాసంతి. వీరి పెంపకం, చదువు బాధ్యతలకోసం ఆరుద్ర సమయాన్ని తీసుకోకుండా ఆమే తన సమయమంతా వెచ్చించారు. 'ఆరుద్ర సమగ్రాంధ్ర సాహిత్యం కోసం విపరీతంగా సమయం ఇవ్వాలనుకునేవాడు. కాని ఇల్లు గడవాలి కదా. సినిమా రంగంలో పని చేస్తేనే డబ్బులు వస్తాయి. అందుకని నేనేమి అనకుండా గబగబా కొన్ని పాటలు రాసేసి ఆ డబ్బు అప్పజెప్పి మళ్లీ పరిశోధనలో పడేవాడు' అన్నారు రామలక్ష్మి. ఆరుద్రకు అనారోగ్యం వస్తే నాటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్ రెడ్డితో మాట్లాడి ప్రభుత్వ సహాయం అందేలా చూశారామె. 'నేను మరణించినప్పుడు ఎటువంటి హంగామా చేయవద్దు' అని ఆరుద్ర కోరడం వల్ల 1998లో ఆరుద్ర మరణించినప్పుడు కేవలం ముగ్గురు నలుగురు స్నేహితులతో కలిసి అంత్యక్రియలు నిర్వహించి ఆ తర్వాతే మరణవార్తను లోకానికి తెలియచేశారు. ఇది సాహిత్య ప్రియులను బాధించినా రామలక్ష్మి ధోరణి అలాగే ఉండేది.

సినిమా రచయిత్రి


కె.రామలక్ష్మికి సినిమా రంగంలో అందరూ సుపరిచితులు స్నేహితులు. వారిలో భానుమతి రామకృష్ణ, జయలలిత, వాణిశ్రీ తదితరులు ఉన్నారు. కె.విశ్వనాథ్ తీసిన 'జీవనజ్యోతి' సినిమాకు రామలక్ష్మి కథను అందించారు. ఈ సినిమా నిజానికి వాణిశ్రీ కోసమే రాశారు. కె.రామలక్ష్మి రాశారని వాణిశ్రీ నటించారు. దీని నిర్మాణ సమయంలో విశ్వనాథ్‌కు, రామలక్ష్మికి వాదోపవాదాలు నడిచాయి. దాంతో కె.విశ్వనాథ్ విజయవాడలో జరిగిన శతదినోత్సవంలో 'ఇకపై ఇతరులు రాసిన కథలతో నేను సినిమాలు తీయను' అని ప్రకటించారు. రామలక్ష్మి రాసిన మరో సినిమా 'గోరింటాకు'. అయితే దీని మీద ఆ రోజుల్లో వివాదం చెలరేగింది. దాసరి నారాయణరావు స్టోరీ డిపార్ట్‌మెంట్‌లో తెర వెనుక ఉండి పని చేసిన వారిలో రామలక్ష్మి కూడా ఒకరు. ఆమె 1970లలో సెన్సార్ బోర్డ్ మెంబర్‌గా పని చేశారు.

స్త్రీ పక్షపాతి

రామలక్ష్మి నిత్య జీవితంలోనే కాదు రచనా జీవితంలోనూ ఆధునికురాలు. ఛాందసాలు లేని జీవనం గడపాలని, భార్యాభర్తలు స్నేహమయ జీవనాన్ని అనుభవించాలని, స్త్రీలకు తమ జీవిత భాగస్వామిని ఎంచుకునే స్వేచ్ఛ ఉండాలని ఆ రోజుల్లోనే తన కథలలో చెప్పారామె. 1954లో ఆమె తన తొలి కథా సంపుటి 'విడదీసే రైలుబళ్లు' వెలువరించారు. ఈ సంపుటిలోని 'చీలిన దారులు' అనే కథలో ఒక జంట పెళ్లి చేసుకోకుండా సహజీవనం ప్రారంభిస్తారు. పెళ్లి ప్రేమను చంపేస్తుంది అని ఆ కథలో రాసి అప్పటికి తెలియని సహజీవనాన్ని ప్రతిపాదించారామె. 'తొణికిన స్వప్నం', 'ఒక జీవికి స్వేచ్ఛ', 'అద్దం' తదితరాలు ఆమె ఇతర కథా సంపుటాలు. భార్యాభర్తలు స్నేహితులుగా ఉండాలని సూచిస్తూ 1970లలో ఆమె రాసిన 'పార్వతి కృష్ణమూర్తి కథలు' పాఠకాదరణ పొందాయి. ఇందులో భార్య అరమరికలు లేకుండా భర్తతో తన అభిప్రాయాలను చెబుతుంది. స్నేహాన్ని, గౌరవను ప్రదర్శిస్తుంది. భార్యంటే భర్త చెప్పినట్టుగా పడుండాలనే నాటి ధోరణికి ఈ పాత్ర పూర్తి భిన్నం. రామలక్ష్మి రాసిన కథల్లో 'అదెక్కడ' విశిష్టమైనది. ఆ కథలో ముఖ్య పాత్ర తన పేరు మర్చిపోతుంది. దాని కారణం భర్త, పిల్లలు అందరూ 'అది' అని పిలుస్తూ ఉండటమే. చివరకు ఆమె ఒకరోజు ఇంట్లో నుంచి వెళ్లిపోతుంది. భర్త 'అదెక్కడ' అని ఎందరిని అడిగినా కనిపించదు. పురుషుడు మోసం చేస్తే స్త్రీ సింగిల్ మదర్‌గా జీవించగలదనే సందేశం ఇస్తూ కథలు రాశారు. బేలగా ఉండే స్త్రీలను అలాంటి పాత్రలను రామలక్ష్మి హర్షించలేదు. స్త్రీలు ఆత్మవిశ్వాసంతో ధైర్యంగా తమ జీవితాన్ని మలుచుకోవాలని కోరుతారు.

ఆమె రచనలను ఈ తరానికి మళ్లీ చేరువ చేయాల్సి ఉంది.

కళ




విజేత కుమార్

ఫుట్‌బాల్ చెప్పిన కథ

మార్పు అనేది సామాజిక ఉద్యమాలతోనే కాదు...సరదాగా మొదలయ్యే ఆటలతో కూడా సాధ్యపడుతుందని నిరూపించింది రాజస్థాన్‌కు చెందిన మహిళా జన్ అధికార్ సమితి. ఫుట్‌బాల్ ఆటతో అమ్మాయిల ఆలోచన ధోరణిలో వచ్చిన మార్పు, చైతన్యాన్ని ప్రపంచానికి పరిచయం చేసింది కికింగ్ బాల్స్...

రాజస్థాన్‌లో అనేక ప్రాంతాల్లో బాల్యవివాహాలు సర్వసాధారణం. దీన్ని దృష్టిలో పెట్టుకొని బాల్యవివాహాలకు అడ్డకట్టవేయడానికి మహిళా జన్ అధికార్ సమితి అమ్మాయిల కోసం ఊళ్లలో 'ఫుట్‌బాల్ క్లబ్'లను ఏర్పాటు చేసింది.

బాల్యవివాహాల నిరోధానికి, ఫుట్‌బాల్ ఆటకు సంబంధం ఏమిటి? అనే సందేహం సహజంగానే వస్తుంది. అయితే ఆ ఫుట్‌బాల్ క్లబ్‌లు ఆట మెలకువలకు మాత్రమే పరిమితం కాకుండా పరివర్తన కేంద్రాలుగా మారడమే కొసమెరుపు.

ఆట ఆడటం కోసం సాయంత్రం ఎంతో మంది అమ్మాయిలు గ్రౌండ్‌కు వస్తారు. ఆట పుణ్యమా అని వారి మధ్య స్నేహం పెరిగింది. ఆట అయిపోయిన తరువాత రకరకాల కబుర్లు చెప్పుకునేవారు. అన్ని విషయాలతో పాటు బాల్యవివాహాల టాపిక్ కూడా వచ్చేది.

అంతమాత్రాన పెద్దలను వ్యతిరేకించగలరా? తరాల సంప్రదాయాన్ని కాదనగలరా?

'అవును....అనగలరు' అని ఎందరో అమ్మాయిలు నిరూపించారు. 'చదువు తరువాతే పెళ్లి' అని తల్లిదండ్రులతో గట్టిగా చెప్పారు.

కట్ చేస్తే...

ముంబైలో ఉంటున్న విజేత కుమార్ బ్రాండెడ్ కంటెంట్, మ్యూజిక్ వీడియోలు రూపొందించడంలో మంచి పేరు తెచ్చుకుంది. తన తొలి షార్ట్ ఫిల్మ్ 'బ్లాజ్' న్యూయార్క్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'బెస్ట్ షార్ట్ ఫిల్మ్' అవార్డ్ అందుకుంది.

కొంత కాలం క్రితం విజేత తన స్వస్థలం రాజస్థాన్‌లోని అజ్మీర్‌కు వెళ్లింది. ఒక సాయంత్రం పూట బాల్య జ్ఞాపకాలను పలకరించడానికి తాను చదువుకున్న స్కూలుకు వెళ్లింది. అక్కడ ఆడపిల్లలు చాలా సీరియస్‌గా ఫుట్‌బాల్ ఆడుతుంటే అబ్బురపడింది.

ఆసక్తిగా ఆ అమ్మాయిలను పలకరించింది విజేత.

'స్కూల్ పూర్తయిన తరువాత ఇంటికి వెళితే ఇక బయట అడుగుపెట్టడం అంటూ ఉండేది కాదు. అలాంటిది ఫుట్‌బాల్ ఆట వల్ల రోజూ సాయంత్రం గ్రౌండ్‌కు రాగలుగుతున్నాను' అని తనకు లభించిన స్వేచ్ఛ గురించి చెప్పింది ఒక అమ్మాయి.

ఫుట్‌బాల్ ఆట వల్ల తమలో పెరిగిన ఆత్మవిశ్వాసం, నలుగురితో కలిస్తే వచ్చే ధైర్యం, బాల్యవివాహాలపై వ్యతిరేకత గురించి మరో అమ్మాయి వివరంగా చెప్పింది. ఇలా అందరూ తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

> 'వావ్' అనుకోవడమే కాదు డాక్యుమెంటరీ తీయాలని కూడా అనుకుంది విజేత. అనేకానేక సందేహాలతో తొలుత వారు కెమెరా ముందుకు రావడానికి నిరాకరించారు. అయితే విజేతకు వారితో స్నేహం పెరిగాక, తన మీద నమ్మకం ఏర్పడిన తరువాత 'కికింగ్ బాల్స్' పేరుతో డాక్యుమెంటరీ రూపుదిద్దుకుంది.

'వావ్' అనుకోవడమే కాదు డాక్యుమెంటరీ తీయాలని కూడా అనుకుంది విజేత. అనేకానేక సందేహాలతో తొలుత వారు కెమెరా ముందుకు రావడానికి నిరాకరించారు. అయితే విజేతకు వారితో స్నేహం పెరిగాక, తన మీద నమ్మకం ఏర్పడిన తరువాత 'కికింగ్ బాల్స్' పేరుతో డాక్యుమెంటరీ రూపుదిద్దుకుంది.

పిల్లలతో కలిసి ఈ డాక్యుమెంటరీని చూసింది విజేత. 'కికింగ్ బాల్స్' పిల్లలకు నచ్చింది. ఆ తరువాత ప్రపంచ ప్రేక్షకులకు కూడా నచ్చింది.

బ్యూటిప్స్

ఏమి చేయకూడదంటే...

అందానికి చిట్కాలు పాటించడానికి ముందు ఏమేం చేయకూడదో తెలుసుకుంటే మంచిదేమో! ఇవన్నీ తెలిసినవే, అయినా ముఖ్యంగా నిర్లక్ష్యం చేసేదిక్కడే.



- మొటిమలను గిల్లితే, మచ్చలు పడతాయి. వీటిని పోగొట్టుకోవడానికి చాలా కష్టపడాలి. గిల్లినప్పుడు మొటిమల నుండి వెలువడిన స్రావం ముఖం మీద ఎక్కడ తగిలితే అక్కడ కూడా మొటిమలు వస్తాయి.
- ఫంక్షన్‌కు వెళ్లే ముందు మేకప్ వేసుకుంటాం, కానీ తిరిగి వచ్చాక తుడిచేయడానికి బద్ధకించి అలాగే నిద్రపోతాం. కొబ్బరినూనెతో తుడుచుకునేంత ఓపిక లేకపోతే కనీసం గోరువెచ్చని నీటిలో కాటన్ ముంచి అయినా మేకప్ క్లీన్ చేయాలి.
- మేకప్ సామగ్రిని ప్రతి ఆరునెలలకొకసారి అప్‌డేట్ చేసుకోవాలి. ఎక్స్‌పైరీ డేట్ చెక్ చేసుకుని, వాటిని కిట్ నుండి తొలగించాలి.
- మేకప్‌లో ఫౌండేషన్ ఇంపార్టెంట్. దీన్ని జాగ్రత్తగా వేసుకోవాలి. స్కిన్ కలర్‌కు సూటయ్యే షేడ్ వాడాలి. అవసరమైన మేరకే వాడాలి.
- హెయిర్ కండిషనర్ వాడేటప్పుడు చిన్న జాగ్రత్త కావాలి. జుట్టు కుదుళ్లకు తగలకుండా అప్లై చేయాలి. జుట్టు పొడిబారినప్పుడు మాత్రమే కండిషనర్ వాడాలి.

ఇంటిప్స్

సహజమైన రూమ్ ఫ్రెషనర్

- అరకప్పు టేబుల్ సాల్ట్ తీసుకుని, అందులో గులాబీ రేకులను వేయాలి. వీటితోపాటు ఒక స్పూన్ లవెండర్ ఆయిల్ లేదా ఆల్మండ్ ఆయిల్ వేయాలి. అంతే! గది సువాసనలతో నిండిపోతుంది.
- దీన్ని మరింత సులువుగా చేయాలంటే వొలిచిన నారింజ లేదా కమలా పండు మీద టేబుల్ స్పూన్ సాల్ట్‌ను చల్లి ఒక మూలన పెడితే సరి!
- సింక్ మెరవడానికి: ఖరీదైన క్లెన్సర్ జోలికి పోకుండా సింక్ పరిశుభ్రంగా... కొత్త దానిలా కనిపించాలంటే... నిమ్మరసంలో కొద్దిగా టేబుల్ సాల్ట్ వేసి సింక్‌ను తుడిస్తే చాలు... చూస్తుండగానే సింక్ కొత్తదానిలా మెరుస్తుంది.



పచ్చదనాల పొదరిల్లు

మొక్కలో మొక్కనై!

**మందారాలు 16 రంగులున్నాయి.
జామ చెట్లు ఏడురకాలున్నాయి.
అరటి పండ్ల చెట్లు ఐదు రకాలు.
వేప, సీమచింత, కానుగ...
మర్రి, రావి, జువ్వి, కొబ్బరి...
కుండీల్లో ఒదిగిపోయాయి.
రణపాల, కొండపిండి...
ఇన్సులిన్ ప్లాంట్, కప్పరిల్ల...
ఔషధమొక్కల లిస్ట్ ఇది.
ఇవన్నీ ఉన్నది నర్సరీలో కాదు.
మొక్కల్ని పిల్లల్లా పెంచే మంజుల ఇంట్లో.
మనం తినే పంటలు పండించుకుంటున్నాం.
పీల్చే గాలిని కూడా 'పెంచుకుందాం' అంటోందామె.**

''ఆమెకు గ్రీన్ ఇండియా చాలెంజ్ విసిరిన వాళ్లు లేరు. తనకు తానుగా తీసుకున్న చాలెంజ్ కూడా కాదు. ఆమె మనసు కోరుకున్న ముచ్చట. పచ్చదనంతో ఆమె పాతికేళ్ల ప్రస్థానానికి ప్రతిరూపం ఈ ఇల్లు. ఆంధ్రప్రదేశ్, నెల్లూరు జిల్లా, గంగపట్నం గ్రామంలో 65 అంకణాల స్థలంలో ఉన్న ఈ ఇంటి పేరు 'జీఆర్‌కే గార్డెన్'. గేటు ముందు నిలబడి చూస్తే ఇల్లు కనిపించదు. అల్లిబిల్లిగా అల్లుకున్నట్లున్న చెట్లు, తీగలను తొలగించి చూస్తే తప్ప గోడలు కనిపించవు. ఎన్ని మొక్కలున్నాయి? ఎన్ని రకాలున్నాయి? అని లెక్కపెట్టాలంటే సాధ్యమయ్యేటట్లు కనిపించలేదు. ఆ వివరాలన్నీ ఈ మొక్కల తల్లి మంజుల చెప్పాల్సిందే.

సేకరణ చిన్న పని కాదు!

''నేను ఐసీడీఎస్‌లో ఇన్‌చార్జ్ సూపర్‌వైజర్‌ని. ఉద్యోగంలో పిల్లల్ని చూసుకోవడం, ఇంట్లో మొక్కల్ని పెంచుకోవడమే నా లైఫ్. పండ్ల మొక్కలు దేశీవిదేశీ అన్నీ కలిపి వందకు పైగా ఉన్నాయి. తీగజాతితో కలిపి పూల మొక్కలు వందల్లో ఉన్నాయి. బాటిల్స్, కుండీలు, డ్రమ్ములు మూడు వేలకు పైగా ఉన్నాయి. నా దగ్గర పేపర్ వైన్ మొక్క కూడా ఉంది. యూ ట్యూబ్‌లో మ్యాడ్ గార్డెనర్ మాధవి గారి గార్డెన్ నుంచి తీగజాతులు తెప్పించుకున్నాను. హైదరాబాద్ నర్సరీ మేళాల నుంచి సేకరించాను. బెంగళూరు నుంచి కూడా తెచ్చుకున్నాను. మొక్కలు ఎన్ని కొంటున్నానో లెక్క చూసుకోకుండా కొనేస్తాను. కానీ బస్సు వాళ్లను రిక్వెస్ట్ చేసి వాటిని ఇంటికి తెచ్చుకోవడం చాలా కష్టమయ్యేది. స్వయంగా వెళ్లడం కుదరని నర్సరీలకు ఫోన్ చేసి వీడియో కాల్‌లో అక్కడ ఉన్న మొక్కలను చూసి నా దగ్గర లేనివేవో చెప్పి తెప్పించుకుంటున్నాను. యాలకులు, మిరియాలు, దాల్చిన చెక్క, జాపత్రి వంటి సుగంధ ద్రవ్యాల మొక్కలన్నీ ఉన్నాయి, కానీ లవంగాల తీగ మాత్రం దొరకలేదు.

సీతాఫల కుటుంబం

సీతాఫలం మనకు బాగా తెలుసు. నా దగ్గర రామాఫలం, లక్ష్మణఫలం, హనుమఫలం కూడా ఉన్నాయి. కుండీల్లో కాసే పనస నుంచి యాపిల్ మూడు రకాలు, కివీ, అవొకాడో కూడా పెంచుతున్నాను. ఓ సారి ఎవరితోనో మాట్లాడుతూ 'మా పాప కంటే ముందు మొక్కలనే చూసుకుంటాన'ని చెప్పాను. ఆ మాటను గుర్తు చేసి మరీ దెప్పుతుంటుంది మా అమ్మాయి. తానిప్పుడు హైదరాబాద్‌లో చదువుకుంటోంది. మా వారు కృష్ణపట్నం పోర్టులో ట్రాన్స్‌పోర్ట్ సూపర్‌వైజర్. ఆయనకు ఇంటి నిండా మొక్కలున్నాయని మాత్రమే తెలుసు. మొక్కల పేర్లు కూడా తెలియదు. ఆయన మొక్కల సరదా అంతా సెల్ఫీలు తీసుకుని వాట్సాప్ డీపీలు పెట్టుకోవడం వరకే. మొక్కల పని అంతా నేను, మా అమ్మ చూసుకుంటాం. ఉదయం రెండు గంటల సేపు నేను టెర్రస్ మీద పని చేస్తాను. నేను, మా వారు డ్యూటీలకు వెళ్లిన తర్వాత మా అమ్మ మూడు గంటల సేపు కింద ఉన్న మొక్కల పని చూసుకుంటుంది. సాయంత్రం వచ్చిన తర్వాత కూడా నాకు గంట– రెండు గంటల సేపు ఎరువు కలపడం వంటి ఏదో ఒక పని ఉంటుంది.

చెట్లమ్మ

మా ఇంటి ఇరుగుపొరుగు వాళ్లు 'టెర్రస్ మీద ఇంత బరువు పెడుతున్నావు. ఇల్లు జాగ్రత్త' అంటూ ఉంటారు. ఇల్లు పాడయితే మరో చిన్న ఇల్లు కట్టుకుంటాను. మొక్కలు పోతే మళ్లీ మొక్కలు పెరగాలంటే ఎన్నో ఏళ్లు పడుతుందని చెబుతాను. నీ చుట్టుపక్కల ఉండడం మాకూ మేలే. మేము పెంచకపోయినా నువ్వు పెంచిన మొక్కల గాలిని పీల్చుకుంటున్నాం అని నవ్వుతారు. మా చెల్లి కొడుకైతే నన్ను చెట్లమ్మ అనే పిలుస్తాడు. ప్రతి ఇల్లూ మొక్కల్ని పెంచితే గాలి ఎందుకు కలుషితమవుతుంది? దారికి అడ్డు వస్తోందని, మరేదో పనులకు ఇబ్బందవుతోందని... ఎన్నో ఏళ్లు పెరిగిన చెట్టుని నిలువునా నరికేస్తుంటారు. పెరిగిన చెట్టుని నరకడం కాదు, ఒక చెట్టుని పెంచి చూడండి అని గొంతెత్తి అరవాలనిపిస్తుంటుంది'' అని మొక్కల మీద తన ప్రేమను వ్యక్తం చేశారు గుడి మంజుల.

– వాకా మంజులారెడ్డి

ఎనిమిదిళ్లు మారాను!

మొక్కల కోసం మార్కెట్‌లో దొరికే కుండీలు చాలవని పెద్ద పెద్ద సిమెంట్ కుండీలు కూడా నేనే స్వయంగా చేసుకున్నాను. ఇల్లు మారిన ప్రతిసారీ ఈ కుండీలను తీసుకెళ్లడం ఎంత కష్టమయ్యేదో. అలా ఎనిమిదిళ్లు తిప్పాను. నా కష్టం చూసి మా నాన్న ఈ ఇల్లు అమ్మకానికి వచ్చిన సంగతి తెలిసి వెంటనే కొన్నారు. అప్పుడు కూడా 'నీకు ఇల్లు' అని చెప్పలేదు. 'నువ్వు మొక్కలు పెంచుకోవడానికి ఇల్లు' అని చెప్పారు. నాన్న గుర్తుగా నాటిన మామిడి చెట్టు చూడండి ఎంత ఎదిగిందో చూడండి.

– గుడి మంజుల, మొక్కల ప్రేమికురాలు

